ఆశీర్వదించండి.. మరింత అభివృద్ధి చేస్తా ..

నారాయణపేటలో ప్రచారంలో పాల్గొన్న రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్, అర్గుల్ నుంచి నారాయణపేట వరకు నిర్వహించిన బైక్ ర్యాలీలో పాల్గొన్న బాజిరెడ్డి

బీఆర్ఎస్ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్

జక్రాన్‌పల్లి, నవంబర్ 8 : బీఆర్ఎస్ హయాంలోనే రూరల్ నియోజకవర్గం అభివృద్ధి చెందిందని, తనను ఎన్నికల్లో మరోసారి ఆశీర్వదిస్తే మరింత అభివృద్ధి చేస్తానని బీఆర్ఎస్ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. మండలంలోని బ్రాహ్మణ్‌పల్లి, అర్గుల్, నారాయణపేట్, లక్ష్మాపూర్, మునిపల్లి గ్రామాల్లో రూరల్ బీఆర్ఎస్ ఎన్నికల ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్సీ వీజీగౌడ్‌తో కలిసి బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బాజిరెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రం ఏర్పడక ముందు రాష్ట్రం ఏవిధంగా ఉందో, ప్రస్తుతం ఎంత అభివృద్ధి చెందిందో ప్రజలు ఆలోచించాలని కోరారు. గడపగడపకూ సంక్షేమం బీఆర్ఎస్‌తోనే సాధ్యమని, కారు గుర్తుకు ఓటు వేసి తనను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఎన్నికల సమయంలో బీజేపీ, కాంగ్రెస్ నాయకులు చెప్పే మాయ మాటలు నమ్మవద్దని అన్నారు. గతంలో రాష్ట్రాన్ని పాలించిన కాంగ్రెస్ నేతలు ప్రజాసంక్షేమాన్ని విస్మరించారని, తమ స్వార్థ ప్రయోజనం కోసం పాకులాడారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీని ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. ఆయా గ్రామాల్లో ప్రచారానికి వెళ్లిన బాజిరెడ్డికి ప్రజలు ఘనస్వాగతం పలికారు. పలు గ్రామాల్లో బైక్ ర్యాలీలు నిర్వహించారు. మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో ధర్పల్లి, జక్రాన్‌పల్లి జడ్పీటీసీలు బాజిరెడ్డి జగన్, తనూజ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీపీ కుంచాల విమలారాజు, వైస్ ఎంపీపీ ముస్కు తిరుపతిరెడ్డి, మండల కో-ఆప్షన్ సభ్యుడు అక్బర్ ఖాన్, మాజీ జడ్పీటీసీ సూర్య సురేశ్ (బుజ్జి),యూత్ విభాగం మండల అధ్యక్షుడు ప్రదీప్, సోషల్ మీడియా అధ్యక్షుడు రాజ్ నాయక్, బ్రాహ్మణ్‌పల్లి సర్పంచ్ లతా దేవరాజ్, ఎంపీటీసీ పోతే రాజు, అక్కపత్రి సురేశ్, సంకెపల్లి పద్మ, వెంకట్, లక్ష్మాపూర్ సర్పంచ్ కైలాస్‌నాయక్, మునిపల్లి బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు రాజారెడ్డి, సొసైటీ చైర్మన్లు ఆర్మూర్ గంగారెడ్డి, శ్రీనివాస్, మాజీ ఎంపీపీ మైదం రాజన్న పాల్గొన్నారు.

బాజిరెడ్డికి మద్దతు తెలుపుతూ ఏకగ్రీవ తీర్మానం

రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌కు తీర్మాన పత్రాన్ని అందజేస్తున్న అర్గుల్ మున్నూరుకాపు సంఘ సభ్యులు

జక్రాన్‌పల్లి, నవంబర్ 8 : బీఆర్ఎస్ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌కు మద్దతు తెలుపుతూ మండలంలోని అర్గుల్ గ్రామానికి చెందిన మున్నూరుకాపు సంఘ సభ్యులు బుధవారం ఏకగ్రీవ తీర్మానం చేశారు. తీర్మాన కాపీని బాజిరెడ్డి గోవర్ధన్‌కు అందజేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సూర్య సురేశ్ (బుజ్జి), యూత్ విభాగం మండల అధ్యక్షుడు ప్రదీప్, జైపాల్ తదితరులు పాల్గొన్నారు.

జాగృతి కన్వీనర్ల నియామకం

కన్వీనర్లకు నియామకపత్రాన్ని అందజేస్తున్న జాగృతి రూరల్ కన్వీనర్ మల్లెల సాయిచరణ్

డిచ్‌పల్లి, నవంబర్ 8 : భారత జాగృతి బలోపేతం కోసం మండలంలోని వివిధ గ్రామాల కన్వీనర్లను జాగృతి రూరల్ కన్వీనర్ మల్లెల సాయిచరణ్ ఆధ్వర్యంలో బుధవారం నియమించారు. బర్ధిపూర్ గ్రామ కన్వీనర్‌గా శ్రీనివాస్, కో-కన్వీనర్‌గా ప్రణయ్‌కుమార్, ముల్లంగి కన్వీనర్‌గా జీవన్‌రెడ్డి, కో-కన్వీనర్‌గా గంగారెడ్డి, సాంపల్లి కన్వీనర్‌గా రాజు, కో-కన్వీనర్‌గా గంగాధర్, దూస్‌గాం కన్వీనర్‌గా రవిగౌడ్, కో--కన్వీనర్‌గా గంగారెడ్డి, రాంపూర్ కన్వీనర్‌గా నితిన్, కో-కన్వీనర్‌గా తోట రాజేందర్‌ను నియమించారు. అనంతరం వారికి నియామకపత్రాన్ని అందజేశారు.

బీఆర్ఎస్‌లోకి భారీగా చేరికలు

రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌తో సారంగాపూర్, గోడౌన్ చౌరస్తా వాసులు

నిజామాబాద్ రూరల్/ డిచ్‌పల్లి/ మోపాల్ (ఖలీల్‌వాడి), నవంబర్ 8 : నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాలకు చెందిన పలువురు బీజేపీ, కాంగ్రెస్‌కు నాయకులు, కార్యకర్తలు రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, మాజీ ఎమ్మెల్సీ వీజీ గౌడ్ ఆధ్వర్యంలో బుధవారం బీఆర్ఎస్‌లో చేరారు. వారికి బాజిరెడ్డి గోవర్ధన్ గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. 13వ డివిజన్ పరిధిలోని సారంగాపూర్, గోడౌన్ చౌరస్తా ప్రాంతాలకు చెందిన 40 మంది బీఆర్ఎస్‌లో చేరారు. డిచ్‌పల్లి మండలంలోని దూస్‌గాం గ్రామానికి చెందిన సుమారు 50 మంది బీజేపీ మహిళా కార్యకర్తలు బాజిరెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరారు. రూరల్ బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మీసాల మధుకర్‌రావు, అక్బర్‌ఖాన్ ఆధ్వర్యంలో మహిళా సంఘాల సభ్యులు 100 మంది, కంజర బీఆర్ఎస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో 22 మంది యువకులు బీఆర్ఎస్‌లో చేరారు. వారిని బాజిరెడ్డి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధిని ప్రజలకు వివరించాలని పార్టీలో చేరిన వారికి బాజిరెడ్డి గోవర్ధన్ సూచించారు.

రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన దూస్‌గాం గ్రామానికి చెందిన బీజేపీ మహిళా కార్యకర్తలు

బాజిరెడ్డికి మద్దతుగా ప్రచారం

తిర్మన్‌పల్లిలో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఇందల్వాయి, నవంబర్ 8 : బీఆర్ఎస్ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌కు మద్దతుగా బీఆర్ఎస్ నాయకులు బుధవారం పలు గ్రామాల్లో ప్రచారం చేశారు. మండలంలోని తిర్మన్‌పల్లి, రంజిత్‌నాయక్ తండా, మల్లాపూర్, గన్నారంలో సర్పంచుల ఆధ్వర్యంలో ప్రచారం చేశారు. కారు గుర్తుకే ఓటు వేసి బాజిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. తిర్మన్‌పల్లిలో వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేసి ప్రచారం ప్రారంభించారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చిలువేరి దాసు, ఎంపీపీ రమేశ్‌నాయక్, ఎంపీటీసీ చింతల దాసు, గ్రామశాఖ అధ్యక్షుడు ప్రవీణ్‌గౌడ్, ఎస్సీసెల్ కన్వీనర్ పాశంకుమార్, ఆరెట్టి రఘు పాల్గొన్నారు.

నిరుపేద యువతి వివాహానికి చేయూత

ధర్పల్లి, నవంబర్ 8 : మండలకేంద్రానికి చెందిన నిరుపేద యువతి రాజ్యలక్ష్మి వివాహానికి బీఆర్ఎస్ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ ఆదేశాల మేరకు రైతుబంధు సమితి జిల్లా సభ్యుడు, మండల కన్వీనర్ పీసు రాజ్‌పాల్‌రెడ్డి చేయూతనందించారు. మండలకేంద్రంలోని యువతి ఇంటికి బుధవారం వెళ్లి రూ. 5 వేల నగదుతోపాటు బియ్యం, పెండ్లి సామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో సొసైటీ మాజీ చైర్మన్ జీయర్ కిశోర్‌రెడ్డి, నాయకులు కమ్మరి గంగాధర్, వెంకట్‌రాజ్, రెడ్డి పాల్గొన్నారు.

కానిస్టేబుల్ ఉద్యోగం సాధించిన యువతకు సన్మానం

సిరికొండ, నవంబర్ 8 : రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన పోలీసు కానిస్టేబుల్ ఫలితాల్లో సత్యశోధక్ పాఠశాలకు చెందిన పూర్వవిద్యార్థులు ఉత్తీర్ణత సాధించి, ఉద్యోగానికి ఎంపికయ్యారు. వారిని సత్యశోధక్ పాఠశాల చైర్మన్ నర్సయ్య, ఉపాధ్యాయులు బుధవారం ఘనంగా సన్మానించారు. బి.గిరిధర్‌గౌడ్, బి.వాల్మీకి, పి.చందు, బి.రవి, వి. రంజిత్, ఎ.రాజ్‌కుమార్‌ను సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గుజరాత్‌లో ఎన్ఎస్ఎస్ వలంటీర్ల ప్రతిభ

సాంస్కృతిక ప్రదర్శనల్లో పాల్గొన్న టీయూ ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

డిచ్‌పల్లి, నవంబర్ 8 : గుజరాత్ రాష్ట్రంలోని గోద్రాలో ఉన్న కళాశ్రీ గోవింద్ గురు యూనివర్సిటీలో నిర్వహించిన జాతీయ సమైక్య శిబిరంలో డిచ్‌పల్లిలోని టీయూకు చెందిన ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ప్రతిభ చూపారు. జాతీయ సమైక్య శిబిరాన్ని ఈ నెల 1 నుంచి 8వ తేదీ వరకు నిర్వహించినట్లు టీయూ ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ కె.రవీందర్‌రెడ్డి, పోగ్రాం అధికారి సరిత తెలిపారు. తెలిపారు. సాంస్కృతిక కార్యక్రమాలలో టీయూ విద్యార్థులు ప్రదర్శించిన బంజారా నృత్యానికి ద్వితీయ బహుమతి సాధించారు. స్వాగత కార్యక్రమంలో కార్తీక్ నాట్య ప్రదర్శన ఆకట్టుకున్నది. భావి భారతదేశంలో యువత పాత్ర, మానవ వనరుల వినియోగం, పర్యావరణం తదితర అంశాలపై టీయూ వలంటీర్లు ఉపన్యసించారు.

రూరల్ నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 40 మంది యువకులు నుడాచైర్మన్ ఈగ సంజీవ్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం బీఆర్ఎస్‌లో చేరారు. వారికి ఈగ సంజీవ్‌రెడ్డి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

– మోపాల్ (ఖలీల్‌వాడి)/ నిజామాబాద్ రూరల్, నవంబర్ 8